సాక్షి
నిర్మల్
మంగళవారం ၊ 27 ၊ జూన్ ၊ 2023



'కొయ్య' కొరత తీర్చేలా.. 8లో▸

నిర్మల్ అనగానే మొదట గుర్తొచ్చేది కొయ్యబొమ్మలే. పొనికి కలపతో ఈ బొమ్మలను తయారు చేస్తారు. అడవుల్లో పొనికి చెట్లు కనుమరుగవడంతో రాష్ట్ర ప్రభుత్వం పొనికి వనాల పెంపకానికి చర్యలు చేపట్టింది.

నేడు సైన్స్ ఉపాధ్యాయులకు టెలీకాన్ఫరెన్స్

నిర్మల్ రూరల్: ఇన్స్పైర్ నామినేషన్స్‌పై (టీశాట్ నెట్వర్క్)లో జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులకు మంగళ వారం టెలికాన్ఫరెన్స్ ఉంటుందని డీఈవో రవీందర్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే టెలికాన్ఫరెన్స్ లో జిల్లాలోని సైన్స్, గణిత ఉపాధ్యాయులు, విద్యార్థు లు తప్పకుండా పాల్గొనాలని సూచించారు. హైద రాబాద్ నుంచి ఎస్‌సీఈఆర్టీ అధికారులు ఇన్స్పైర్ నామినేషన్లపై సూచనలు చేస్తారని తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
27.7 /24.5

వాతావరణం

ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభా వంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వర్షం కురి సే అవకాశం ఉంది. గాలిలో తేమ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కేజీబీవీని సందర్శించిన రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకులు



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకులు ప్రతాప్, అశోక్, నారాయణవర్మ సోమవారం సందర్శించారు. నూతన గ్రంథాలయాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పరిశీలకుల వెంట జిల్లా సెక్టోరియల్ అధికారి నర్సయ్య, సీఆర్పీలు సుధాకర్, మహేందర్, ఎస్‌వో నవిత తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో చెక్‌పోస్ట్



చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు

తానూరు: బక్రీద్ సందర్భంగా గోవులను అక్రమంగా తరలించకుండా తానూరు మండలం సరిహద్దు గ్రామాలైన బెల్‌తరోడా, జౌలా(బి), వడ్గా, మొగ్లి గ్రామాల్లో పోలీసులు సోమవారం చెక్‌పోస్ట్లు ఏర్పాటు చేశారు. ఎవరైనా అనుమతి లేకుండా గోవులను తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై విక్రమ్ హెచ్చరించారు. జౌలా(బి), వడ్గాం సరిహద్దు గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేడు నిర్మల్ డిపోలో రక్తదాన శిబిరం

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ డిపోలో ఈనెల 27న ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ సాయన్న తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, విద్యార్థులు, రక్తదాన శిబిరంలో పాల్గొనాలని కోరారు.

బీజేపీ పాలనలో అనేక సంక్షేమ పథకాలు



ఇంటి గోడపై స్టిక్కర్ అంటిస్తున్న రమాదేవి

భైంసాటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా సోమవారం పట్టణంలోని 114, 116, 146 బూత్‌లలో ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, నాయకులు పోశెట్టి, బాలాజీ సూత్రావే, సాహెబ్‌రావు, రమేశ్, సంపత్ పటేల్, నందుభయ్యా, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: దేశ సమగ్రతకు భంగం వాటిల్లేలా చిన్నారుల మనసులో విషబీజాలు నాటి జిల్లాలో విద్యావ్యవస్థను భయందోళనలకు గురిచేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులను ఉద్యోగాల నుంచి తొలగించాలని, వారిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కైరి శశిధర్ అన్నారు. ఈమేరకు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 3న కుంటాల మండలం ఓలా గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల విద్యార్థులు ర్యాలీ తీశారు. ఇందులో డీఈవో రవీందర్‌రెడ్డి, హెచ్‌ఎం సునీల్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో 'హమ్ బాచ్చోకా నారా హై - పాకిస్తాన్ హామారా హై' అని నినాదాలు చేయించారని ఆరోపించారు. సదరు విద్యాశాఖ అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జంపింగ్‌ల జోరు!



- 'అల్లోల'వైపు అప్పాల..
- 'హస్తం' వైపు పలువురి చూపు
- బలోపేతంపై బీజేపీ దృష్టి
- చేరికలకు పార్టీల ప్రోత్సాహం

నిర్మల్: రాష్ట్ర రాజకీయాల ప్రభావం నిర్మల్‌పై పడుతోంది. కర్ణాటక ఎన్నికల తర్వాత చోటు చేసుకుంటున్న పరిణామాలు జిల్లాలోనూ ప్రభావం చూపుతున్నాయి. ప్రధాన పార్టీలలో చేరికలు, ముఖ్య నాయకులు పార్టీలు మారడం జోరందుకుంటోంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాలతో పోలిస్తే.. రాజకీయ కేంద్రంగా పేరున్న నిర్మల్‌లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. బీజేపీలోకి ఏఐసీసీ నేత మహేశ్వర్‌రెడ్డి రాగా, రాష్ట్రంలో మళ్లీ పుంజుకుంటున్న కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ సీనియర్ నేత శ్రీహరిరావు చేరారు. తాజాగా నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మన్, బీజేపీ నేత అప్పాల గణేశ్ చక్రవర్తి బీఆర్‌ఎస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. మరికొందరు ముఖ్య నేతలు సైతం తమకు అనుకూలంగా ఉన్న పార్టీల్లోకి మారేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. నిర్మల్ నియోజకవర్గంలో ఎవరెటు వెళ్తున్నారన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

'కారు'లోకి అప్పాలకు చోటు..

నిర్మల్ నియోజకవర్గంలో ప్రస్తుతం మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో అన్ని పార్టీలు ప్రత్యర్థుల ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. బీఆర్‌ఎస్ నుంచి శ్రీహరిరావు, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరడంతో ఆ లోటును పూడ్చుకునేందుకు అధికార పార్టీ అన్నిరకాలుగా ప్రయత్నిస్తోంది. ఈక్రమంలోనే గత కొంతకాలంగా నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మన్, బీజేపీ నేత అప్పాల గణేశ్‌చక్రవర్తిపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. పలువురు పార్టీ నేతలతోపాటు ఇటీవల ఎమ్మెల్సీ దండె విఠల్ సైతం ఆయనతో చర్చలు జరిపారు. 2018 ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌లోనే కొనసాగిన గణేశ్‌చక్రవర్తి అప్పటి పరిస్థితుల నేపథ్యంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని విభేదించి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం అక్కడి పరిస్థితుల నేపథ్యంలో ఆయన హస్తాన్ని వీడి బీజేపీ గూటికి చేరారు. తాజా రాజకీయ పరిణామాలతో తిరిగి ఆయనను కారెక్కించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. తన భవిష్యత్తు నేపథ్యం అలాగే రాష్ట్రస్థాయిలో బీజేపీలో జరుగుతున్న పరిణామాల కారణంగా గణేశ్‌చక్రవర్తి సైతం కమలాన్ని వీడి కారెక్కేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం తన అనుచరులతో చర్చిస్తున్న ఆయన త్వరలోనే హైదరాబాద్‌లో గులాబీ కండువా కప్పుకుంటారని సమాచారం.

ఎవరెవరు వస్తారు...

జిల్లాలో మూడు ప్రధాన రాజకీయ పార్టీలు ప్రస్తుతం చేరికలపైనే దృష్టిపెట్టాయి. ఎన్నికలకు కొన్నినెలల సమయం మాత్రమే ఉండటంతో క్షేత్రస్థాయిలో ప్రభావం చూపగలిగే నాయకులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నాయి. బీజేపీలో ఇమడలేకపోతున్న మరికొందరిని తమవైపుకు రప్పించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. మరోవైపు బీజేపీ తమ పార్టీ నుంచి ఒకరిద్దరు నేతలు వెళ్లిపోయినప్పటికీ తమకు పెద్దగా ఇబ్బంది లేదంటూ.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లలోని అసంతృప్త నేతలను తమ వైపుకు తిప్పుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తోంది.

'హస్తం' వైపు పలువురి చూపు...

కర్ణాటక ఎన్నికల్లో విజయాన్ని అందుకోవడంతో తెలంగాణలోనూ పూర్వవైభవాన్ని సాధించే దిశగా కాంగ్రెస్ పరుగులు పెడుతోంది. భారీగా చేరికలను ప్రోత్సహిస్తోంది. బీఆర్‌ఎస్‌లో అసంతృప్త నేతగా ఉన్న ఉద్యమకారుడు, సీనియర్ నాయకుడు శ్రీహరిరావును ఇటీవలే పార్టీలో చేర్చుకుంది. అంతకు కొన్నిరోజుల ముందే సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది అల్లూరి మల్లారెడ్డి సైతం కాంగ్రెస్‌లో చేరారు. మహేశ్వర్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన నిర్మల్ పట్టణ మాజీ అధ్యక్షుడు నాందేడపు చిన్ను తదితరులు సైతం తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. అలాగే వివిధ పార్టీలకు చెందిన కొంతమంది పేరున్న నాయకులు సైతం హస్తం వైపు చూస్తున్నారు.

పార్టీ బలోపేతంపై బీజేపీ దృష్టి...

రాష్ట్రవ్యాప్తంగా చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో జిల్లాలో పార్టీ క్యాడర్ నిస్తేజం చెందకుండా బీజేపీ ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. ప్రధానంగా నిర్మల్ నియోజకవర్గంలో ఏఐసీసీ నేత మహేశ్వర్‌రెడ్డి చేరిన తర్వాత కమలం పార్టీకి మంచి ఊపు వచ్చింది. రాష్ట్రంలోనే గెలిచే స్థానాల్లో నిర్మల్ ఉన్నట్లు ఆ పార్టీ చాలా సందర్భాల్లో ప్రకటించింది. కానీ కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత జిల్లాలోనూ సొంత పార్టీలోనే కొంత నిస్తేజం కనిపిస్తుండటం కమలనాథులను కలవరపెడుతోంది. పలువురు పార్టీ నాయకులు సైతం ప్రత్యర్థి పార్టీలలో చేరుతుండటం ఇబ్బందిగా మారింది. దీన్ని అధిగమించేందుకు పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యక్రమాలకు సిద్ధమవుతోంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లో పొసగలేనివారు బీజేపీవైపు వచ్చేందుకు ఆసక్తి చూపుతుండటం ఆ పార్టీకి కొంత ఊరటనిస్తోంది.

ప్రయాణికులకు భారం.. ఆర్టీసీకి ఆదాయం!



- ఓఆర్ శాతం తగ్గినా ఆదాయం గణనీయం

రెండేళ్లలో వేసవి మూడు నెలల్లో ఆర్టీసీకి ఆదాయం, ఓఆర్ వివరాలిలా..

నెల	ఆదాయం	కి.మీ	ఈపీకె	ఓఆర్(శాతం)
భైంసా డిపో 2022లో..				
ఏప్రిల్	రూ.2,71,67,966	8,34,216	32.46	72
మే	రూ.3,18,20,831	8,90,517	35.73	79
జూన్	రూ.3,28,90,644	8,49,228	38.76	71
భైంసా డిపో 2023లో..				
ఏప్రిల్	రూ.3,02,27,158	8,78,475	34,41	63
మే	రూ.4,05,63,537	9,81,790	41.32	69
జూన్	రూ.3,04,27,796	6,93,843	43.85	73
నిర్మల్ డిపో 2022లో..				
నెల	ఆదాయం	కి.మీ	ఈపీకె	ఓఆర్(శాతం)
ఏప్రిల్	రూ.6,14,78,256	17,07,233	36.01	72
మే	రూ.7,19,90,745	18,20,992	39.53	79
జూన్	రూ.7,65,05,541	17,74,364	43.11	74
నిర్మల్ డిపో 2023లో..				
ఏప్రిల్	రూ.7,05,63,995	17,88,329	39.58	64
మే	రూ.8,96,36,886	19,44,202	46.10	72
జూన్	రూ.6,64,77,724	14,37,475	46.25	72

భైంసాటౌన్: గతేడాదితో పోలిస్తే ఆర్టీసీకి ఈసారి ఆదాయం గణనీయంగా పెరిగింది. మే నెలలో శుభ కార్యాలు ఉండడంతోపాటు పాఠశాలలు, కళాశాలలకు సెలవుల కారణంగా ప్రయాణికులు కుటుంబీకులతో కలిసి పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలు, సందర్శనీయ ప్రదేశాలకు ప్రయాణాలు చేశారు. దీంతో ఆర్టీసీకి ఆశించినదానికి మించి ఆదాయం సమకూరింది. ఇంతవరకు బాగానే ఉన్నా, ఆర్టీసీ బస్సు చార్జీల పెంపుతోపాటు చిల్లర సమస్య లేకుండా రౌండప్ చార్జీలు, మొదటి స్టేజీకి మినిమం టికెట్ ధర, డీజిల్ సెస్‌పేరిట చార్జీల పెంపుతో ప్రయాణికులపై ఆర్థికంగా భారం పడింది. ఈ కారణంగానే ఆర్టీసీకి ఈసారి ఆదాయం గణనీయంగా పెరిగిందన్న అభిప్రాయం ప్రయాణికుల నుంచి వ్యక్తమవుతోంది.

చార్జీల పెంపుతో...

ఆర్టీసీ ఆదాయం పెంచుకునేందుకు పలుమార్లు చార్జీలు పెంచింది. చిల్లర సమస్య తొలగించేందుకు రౌండప్ చార్జీలు అమలు చేసింది. ఆ తరువాత సేఫ్టీ సెస్, డీజిల్ సెస్ పేరిట సైతం బస్ చార్జీలు పెంచారు. దీనికితోడు ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మొదటి స్టేజ్ ప్రయాణికులకు మినిమం చార్జీలు వసూలు చేస్తోంది. ఉదాహరణకు.. భైంసా–నిర్మల్ ఆర్డినరీ బస్సులో ప్రయాణించి మొదటి స్టేజీలో దిగే ప్రయాణికులకు మినిమం రూ.10కి పెంచగా, ఎక్స్‌ప్రెస్‌కు రూ.30 గా ఉంది. భైంసా నుంచి నిర్మల్‌కు ఆర్డినరీ బస్సులో ప్రయాణిస్తే రూ.70, ఎక్స్‌ప్రెస్‌కు రూ.80 చెల్లిస్తున్నారు. గతేడాది ఏప్రిల్, మే, జూన్‌నెలల్లో ఓఆర్(ఆక్యుపెన్సీ రేషియో) శాతం కన్నా ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్(ఇప్పటివరకు) ఓఆర్ శాతం తక్కువగా ఉన్నా ఆదాయం మాత్రం భారీగానే పెరిగింది. అంటే ప్రయాణికుల సంఖ్య తగ్గినా ఆదాయం పెరగడం విశేషం. ఇలా బస్‌చార్జీల్లో పెంపుతో ఆర్టీసీకి ఆదాయం పెరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గోడు వినండి.. గోస తీర్చండి

- ప్రజావాణికి వినతుల వెల్లువ
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- సత్వర పరిష్కారానికి హామీ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ఏ ఆధారమూ లేదు.. రేషన్ కార్డు ఇప్పించి ఆదుకోవాలి.. పట్టా అయిన భూమి రికార్డులో తక్కువగా ఉంది.. భూమి ఆక్రమించాలని చూస్తున్నారు'.. ఇలా పలు సమస్యలతో జిల్లా నలుమూలల నుంచి బాధితులు సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వచ్చారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డికి తమ గోడు వెల్లబోసుకున్నారు. సమస్యలపై అర్జీలు సమర్పించి పరిష్కరించాలని వేడుకున్నారు. కలెక్టర్ సమస్యలను ఓపికగా విని సంబంధిత అధికారులకు అందించారు. త్వరగా పరిష్కరించాలని, పదేపదే తిప్పుకోవద్దని ఆదేశించారు. వివిధ సమస్యలపై 38 అర్జీలు వచ్చాయని కలెక్టర్ తెలిపారు.

గంటన్నర ఆలస్యంగా...

తమ సమస్యలు విన్నవించేందుకు నూతన కలెక్టరేట్ భవనానికి అర్జీదారులు ఉదయం 10 గంటలకే చేరుకున్నారు. కానీ, 11 54 నిమిషాల వరకు కూడా అర్జీలు స్వీకరించేవారు లేక వృద్ధులు, వికలాంగులు, పిల్లాపాపలతో వచ్చినవారు ఇబ్బంది పడ్డారు. 11 56 నిమిషాలకు కలెక్టర్ వరుణ్‌రెడ్డి వచ్చి అర్జీలు స్వీకరించారు. సుమారు గంటన్నరపాటు అధికారులు, అర్జీదారులు కలెక్టర్ కోసం ఎదురు చూశారు.

బస్సు ఏర్పాటు చేయాలి..

నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ భవనం జిల్లా కేంద్రానికి చాలా దూరంగా ఉంది. సమస్యలు చెప్పుకునేందుకు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. ఆటోవాలాలు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. కలెక్టరేట్ వరకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలి.

– శివ లింగు, కుంటాల

మాదకద్రవ్యాలను నియంత్రించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



పోస్టర్లు విడుదల చేస్తున్న జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: మాదకద్రవ్యాల నియంత్రణకు అందరూ సహకరించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నియంత్రణ దినోత్సవం పురస్కరించుకొని మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో సోమవారం కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగ నిరోధంపై ముద్రించిన పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో లోకేశ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె. విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అదను దాటలేదు

- జూలై 15 వరకు విత్తనాలు విత్తుకోవచ్చు
- నకిలీ విత్తనాలతో అప్రమత్తత అవసరం
- విత్తనాలు, ఎరువులకు రశీదు తీసుకోవాలి
- ఆయిల్ పామ్, పండ్లు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలి
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో వ్యవసాయశాఖ జిల్లా అధికారి అంజి ప్రసాద్

సాక్షి ఫోన్ ఇన్



అంజి ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

నిర్మల్‌చైన్‌గేట్: రుతుపవనాల రాక ఆలస్యం కావడం.. వరుణుడి జాడే లేకపోవడంతో ఎన్నో ఆశలతో సాగుకు భూములు సిద్ధం చేసిన రైతుల్లో కొంత ఆందోళన నెలకొందని.. కానీ, ఎలాంటి ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్ సూచించారు. విత్తుకునే అదను దాటలేదని పేర్కొన్నారు. జూలై 15 వరకు వివిధ రకాల పంటలు వేసుకోవచ్చని తెలిపారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని, వీలైనంత వరకు పంట మార్పిడి చేయాలని అప్పుడే అధిక దిగుబడి సాధించవచ్చని వివరించారు. విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని, 70 నుంచి 110 మి.మీ. వర్షం పడితేనే విత్తనాలు విత్తుకునేందుకు అనువుగా ఉంటాయన్నారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్‌కు రైతుల నుంచి విశేష స్పందన లభించింది. వారు అడిగిన ప్రశ్నలకు డీఏవో సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: ప్రస్తుతం సోయాబీన్ పంట ఎప్పటివరకు వేయవచ్చు? కాళేశ్వరం ప్రాజెక్టు 27, 28 ప్యాకేజీ పనులకు భూములు ఇచ్చిన రైతులకు రైతుబంధు ఈసారైనా వస్తుందా? – రఘు, కుంటాల

డీఏవో: సోయాబీన్ పంట జూలై 15 వరకు వేసుకోవచ్చు. రైతుబంధుకు సంబంధించి ఈసారి కొత్త వారికి కూడా అందుతుంది. ఇందుకు తమ అకౌంట్ వివరాలు సంబంధిత ఏఈవోల దగ్గర వివరాలు సరి చేసుకోవాలి.

ప్రశ్న: ఆయిల్‌పామ్ పంట పొలంలో వేసుకోవచ్చా? ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?
– గంగారాం, న్యూ వెల్మల్, సోన్

డీఏవో: మొదట ఆయిల్‌పామ్ వేసుకోవాలంటే పొలాన్ని చేనుగా మార్చుకోవాలి. ఆయిల్ పామ్ సాగుకు 365 రోజులు నీరు ఉండాలి. మైక్రో గేట్స్ అమర్చుకోవాలి. అన్ని రకాల నేలలు ఈ పంట సాగుకు అనుకూలం.

ప్రశ్న: ప్రస్తుతం ఎటువంటి పంటలు వేసుకోవాలి? ఏ రకమైన విత్తనాలు వాడాలి?
– వెంకటేశ్, కొత్త మద్దిపడగ, కడెం

డీఏవో: నేల స్వభావాన్ని బట్టి పంటలు వేసుకోవాలి. ప్రస్తుతం వాటర్ తక్కువ ఉన్న స్థలాలు అధిక సాంద్రతలో పండించే పత్తి అందుబాటులోకి వచ్చింది. ఈ పత్తి విత్తనాలు ఎకరానికి 5 ప్యాకెట్లు వేసుకోవాలి. మొక్కల ఎత్తు పెరగకుండా మేపికాట్ క్లోరైడ్ ద్రావణం పిచికారీ చేయాలి. లైసెన్స్ ఉన్న డీలర్ దగ్గరే రశీదు తీసుకుని కొనుగోలు చేయాలి.

ప్రశ్న: నారు ఏ సమయంలో పోసుకోవాలి? నేను 22 రోజుల మధ్యలో నాటు వేశాను.

డీఏవో: 120 రోజుల పంటకు 28 రోజులకు, 150 రోజులకు 35 రోజుల నారు వేసుకోవాలి.

ప్రశ్న: నల్ల, దుబ్బ భూమిలో ఏయే పంటలు వేసుకోవాలి? – పోశెట్టి, ఎల్వి, తానూర్

డీఏవో: నల్ల భూమిలో కాటన్, సోయాబీన్, దుబ్బ భూమిలో సోయాబీన్ వేసుకోవాలి. 95 రోజులలో చేతికి వచ్చే పంటలు వేసుకోవాలి.

ప్రశ్న: వానాకాలంలో ఏఏ వరి రకాలు వేసుకోవచ్చు
– భీమ్ రాజ్, బాదన్‌కుర్తి

డీఏవో: జూన్ 15 వరకే బీపీటీ సోనా రకం వరి సాగుకు నారుపోసుకోవాలి. ఆ తర్వాత పోసుకుంటే వాటికి రోగాలు వస్తాయి. సన్నరకం ధాన్యం ఆర్‌ఎన్‌ఆర్ కేఎస్‌ఎం, దొడ్డురకం 1010 ని జూలై 15 వరకు నారు పోసుకోవాలి. వరి నా రుమడిలో ఒడిపిలి నివారణకు నామిని గోల్డ్ వాడాలి.

ప్రశ్న: వర్షాలు 20 రోజులు ఆలస్యంగా కురుస్తున్నాయి. ఏ పంటలు వేసుకోవాలి?
– ఓస రాజేశ్వర్, లక్ష్మణచాంద

డీఏవో: ఇప్పటికీ పంటలు వేసుకోవడానికి సమయం మించిపోలేదు. ప్రస్తుత కాలంలో మొక్కజొన్న నీరు సమృద్ధిగా ఉంటే 365 రోజులు వేసుకునే పంట. కరిష్మా, 9305 లాంటి తొందరగా చేతికి వచ్చే పంటలు వేసుకోవాలి.

ప్రశ్న: జీలుగసాగు చేయడం ఎలా? చివరి దుక్కుల్లో ఎరువులు వేయొచ్చా?– వెంకట రమణ, లింబ

డీఏవో: జీలుగ విత్తనాలతో భూమి సారానికి ఎంతో మేలు చేస్తుంది. జీలుగ విత్తిన 25 నుంచి 45 రోజుల వ్యవధిలో పూత దశకు వస్తుంది. జీలుగను దుక్కిలో కలిపేయాలి. జీలుగ విత్తనాలు సబ్సిడీతో రైతులకు అందిస్తున్నాం.

ప్రశ్న: చవుడు భూముల్లో ఎలాంటి పంటలు వేసుకోవచ్చు. – సోము, కౌట్ల

డీఏవో: చౌడు భూముల్లో ఎట్టి పరిస్థితుల్లో కందితోపాటు పప్పు దినుసుల పంటలు వేయొద్దు. పత్తి, సజ్జలు, తెల్ల కుసుమలు వేసుకోవచ్చు. జీలుగ వేయడంతో సత్తువ వస్తుంది.

ప్రశ్న: రాయితీ యంత్రాలు, వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉన్నాయా?
– పుప్పాల రవి, పెంబి

డీఏవో: ఈ ఆర్థిక సంవత్సరంలో యంత్రాలు వ్యవసాయ పరికరాలు రైతులకు ఇచ్చే ప్రణాళిక ప్రభుత్వం నుంచి రాలేదు. 2019 తర్వాత సబ్సిడీ ట్రాక్టర్లు జిల్లాలో ఎవరికీ ఇవ్వలేదు, యంత్రలక్ష్మి పథకం నిలిపివేయబడింది.

ఒకరిద్దరు పోతే నష్టం లేదు

- మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ జాతీయ పార్టీ అని ఒకరిద్దరు కార్యకర్తలు పార్టీ నుంచి వెళ్లిపోతే పార్టీకి జరిగే నష్టమేమీ లేదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ బలంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో నిర్మల్‌లో కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఉమ్మడి జిల్లాలో పార్టీని పటిష్టం చేసేందుకు త్వరలోనే భారీగా చేరికలు ఉంటాయన్నారు. ఇప్పటికే చాలా మంది ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు చేరారని తెలిపారు.

మంత్రి జిల్లాకు చేసిందేమీ లేదు..

రాష్ట్ర మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి గడిచిన 9 ఏళ్లలో జిల్లాకు చేసింది ఏమీ లేదన్నారు. ఆయన మాయ మాటలు నిర్మల్ ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని నియోజకవర్గమంతా పక్కన పెట్టి తన స్వార్థం కోసం సొంతూరు ఎల్లపల్లిలో ఆర్భాటంగా కట్టించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. తొమ్మిదిన్నర ఏళ్లుగా తన కుటుంబ సభ్యుల, అనుచరుల ఆస్తులు పెంచుకునేందుకు ప్రయత్నించారే తప్ప ఏ రోజు అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడతానని ప్రతీ ఎలక్షన్ సమయంలో ఇచ్చిన హామీ ఇప్పటికీ కలగానే మిగిలిందన్నారు. చెరువులకు అడ్డుగా గోడ నిర్మించడం వల్ల రిజర్వాయర్ల గేట్లు తెరిచినప్పుడు నీరు సాఫీగా వెళ్లకుండా పంటలను ముంచెత్తుతోందని తెలిపారు.

కాంగ్రెస్ స్టీరింగ్ కేసీఆర్ చేతిలో..

కాంగ్రెస్ పార్టీ స్టీరింగ్ కేసీఆర్ చేతిలో ఉందని ఆయన ఎలా చెబితే అలా కాంగ్రెస్ పార్టీ నడుచుకుంటుందన్నారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే బీజేపీపై కేసీఆర్ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తుందని విమర్శించారు. బీఆర్‌ఎస్ కాంగ్రెస్‌కు బి పార్టీగా మారుతుందన్నారు. మైనార్టీ ఓట్లను తమ వైపు తిప్పుకునేందుకే బీఆర్‌ఎస్ కాంగ్రెస్ ఏకమవుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ఎడమ చేతిలో ఓవైసీని కుడి చేతిలో రాహుల్ గాంధీని పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, సామ రాజేశ్వర్‌రెడ్డి, సాదం అరవింద్, నాయిడి మురళి, సరికెల గంగన్న నాయకులు పాల్గొన్నారు.

మహిళలు తమహక్కులు తెలుసుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న జడ్జి అజేశ్‌కుమార్

సారంగపూర్: మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి తెలుసుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని చించోలి(బి) మహిళా ప్రాంగణంలో మహిళల భద్రత, హక్కులు అనే అంశంపై సోమవారం అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సంరక్షణకు అనేక చట్టాలను చేశాయని తెలిపారు. మహిళలపై పెరుగున్న అఘాయిత్యాల నేపథ్యంలో వారికి రక్షణ కల్పించడానికి అనేక చట్టాలు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రత్యేకంగా పోక్సో, అత్తారింటి వేధింపుల నేపథ్యంలో మహిళలను మానసికంగా, శారీరకంగా, లైంగికంగా వేదించే దుర్మార్గులను శిక్షించే చట్టాలు ప్రస్తుతం అమలు చేస్తున్నారని వివరించారు. ప్రతీ మహిళ తనకు జరుగుతున్న అన్యాయాన్ని ధైర్యంగా ఎదర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ లీగర్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు రాజలింగం, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యుడు లింగాగౌడ్, న్యాయవాది మధుకర్, మహిళా ప్రాంగణం డీఎం విజయలక్ష్మి, మహిళా ప్రాంగణం మహిళలు, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

30న జాబ్‌మేళా

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతి, యువకుల కోసం ఉట్నూర్‌లోని యూత్ ట్రైనింగ్ శిక్షణ కేంద్రంలో ఈనెల 30న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ మేళా ఉంటుందని పేర్కొన్నారు. ఎంఎస్ఎన్ ల్యాబోరేటరీస్, బయోఆర్గానిక్, ఫ్లిప్‌కార్ట్, క్రీమ్‌స్టోన్, మెడ్‌ప్లస్ కంపెనీల్లో 325 ఉద్యోగాలకు ఎంపిక ఉంటుందని వివరించారు. మేళాలో పాల్గొనేవారు 18–35 ఏళ్లలోపు ఉండాలని పేర్కొన్నారు. బయోడేటా, విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 78936 16392 సెల్‌నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని టూటౌన్ పరిధిలోని ఫిల్టర్‌బెడ్‌లో చోరీకి పాల్పడిన నిందితుడు సాహిర్‌ను పట్టుకుని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఊశన్న తెలిపారు. తాను ఉంటున్న అద్దె ఇంట్లో ఈనెల 23న చోరీకి పాల్పడ్డాడు. టీవీ, గ్యాస్ సిలిండర్, రూ.5 వేల నగదును ఎత్తుకెళ్లాడు. బాధితుడు బండ ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు


కూలిన లోపలి భాగం

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో వర్షానికి ఇల్లు కూలింది. ఇటీవల కురిసిన వానలకు ఇంటి పైభాగంలో నీరు చేరడంతో కర్ర తడిచి కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తన భర్త నర్సారెడ్డి కొన్నేళ్ల క్రితం మృతిచెందాడని, ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పెన్షన్‌తో జీవిస్తున్న తనకు సాయం అందించాలని బాధితురాలు తోట భోజమ్మ వేడుకుంటుంది.

చిరుత దాడిలో లేగదూడ మృతి

తిర్యాణి: మండలంలోని గిన్నెదరి రేంజ్ పరిధిలోని మందగూడ అటవీ ప్రాంతంలో లేగదూడపై చిరుత దాడి చేసి హతమార్చింది. ఫారెస్టు సెక్షన్ అధికారి శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం మందగూడ శివారులోని అటవీ ప్రాంతంలో నైతం లక్ష్మణ్‌కు చెందిన లేగదూడపై చిరుత దాడి చేసి చంపింది. కాగా, ఆ ప్రాంతాన్ని ఫారెస్టు అధికారులు సోమవారం పరిశీలించారు. సెక్షన్ అధికారులు శ్రీనివాస్, సూర్యారావు, బీట్ అధికారులు అవినాష్, సురేశ్ ఉన్నారు.

కొయ్య కొరత తీర్చేలా..


పొనికి కర్రతో నిర్మల్ బొమ్మలు తయారు చేస్తున్న కళాకారులు

- నిర్మల్ జిల్లాలో పొనికి వనాల పెంపకానికి చర్యలు
- అనువైన స్థలాలు గుర్తింపు
- హరితహారంలో మొక్కలు నాటేలా చర్యలు
- బొమ్మల తయారీకి ఊతమిచ్చేలా..

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ అనగానే మొదట గుర్తొచ్చేది కొయ్యబొమ్మలే..వీటి తయారీ పరిశ్రమ కొలువుదీరింది ఇక్కడే. పొనికి చెట్టు నుంచి తీసే కలప ముడిసరుకుతో ఈ బొమ్మలను కళాకారులు తయారు చేస్తారు. ఈ కర్ర మృదువుగా, తేలికగా ఉపయోగించవచ్చు. ప్రస్తుతం అడవుల్లో పొనికి చెట్లు కనుమరుగవడంతో జిల్లాలో గత ఐదారేళ్లుగా బొమ్మల తయారీ పరిశ్రమ తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటోంది. దాదాపు 150 కళాకారుల కుటుంబాలు ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పొనికి మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టింది. ఈ మేరకు మొక్కల పెంపకానికి అనువైన ప్రాంతాలను అధికారులు గుర్తించారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.


అడవుల్లో సహజసిద్ధంగా పెరిగే పొనికి చెట్టు

పొనికి కర్ర ప్రత్యేకం..
నిర్మల్ కొయ్యబొమ్మల తయారీకి ఉపయోగించే పొనికి చెట్టు నుంచి తీసిన కలప చాలా ప్రత్యేకం. ఎందుకంటే ఈ పొనికి కర్ర తేలికగా సరళంగా ఉండి, బొమ్మను చెక్కే క్రమంలో మృదువుగా ఉంటుంది. బొమ్మల తయారీలో కళాఖండంగా తీర్చుదిద్దవచ్చు. అందుకే పొనికి కర్రను వినియోగిస్తామని కళాకారులు అంటున్నారు.

పొనికి మొక్కల పెంపునకు అనువైన ప్రాంతాలు..
పొనికి మొక్కల పెంపకం కోసం ప్రయోగాత్మకంగా పలు గ్రామ పంచాయతీలను డీఆర్డీఏ, ఇతర అధికారులు ఎంపిక చేశారు. మట్టి నమూనా పరీక్షల ఆధారంగా మామడ మండలం కొరిటికల్, గాయిద్‌పెల్లి, మొండిగుట్ట, తాండ్ర, వాస్తాపూర్, లింగాపూర్, తోటిగూడ, రాయదారి, సారంగాపూర్ మండలం గోపాల్‌పేట్ సమీపంలోని అటవీప్రాంతం అనువైనవిగా గుర్తించారు. ఇప్పటికే మట్టికి భూసార పరీక్ష అనంతరం ఇక్కడ మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. రాయదారి సమీపంలో 500 మొక్కలు నాటారు. మొదటగా లింగాపూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో హరితహారం కింద వెయ్యి పొనికి మొక్కలు నాటారు. వాస్తాపూర్, గాయిద్‌పెల్లి తదితర గ్రామాల్లో దశలవారీగా మొక్కల పెంపకం చేపట్టనున్నారు. సారంగాపూర్ మండలం గోపాల్‌పేట సమీపంలో మహబూబ్ ఘాట్స్ ప్రాంతంలో 2,200 మొక్కలు నాటారు. నీటి వసతి కోసం ప్రత్యేకంగా డీఆర్డీఏ అధికారులు బోర్‌వెల్ వేయించారు.


మామడ మండలంలో పొనికి మొక్కలు నాటుతున్న అధికారులు

మొక్కలు నాటించాం



పొనికి కర్రకు తీవ్రమైన కొరత ఏర్పడిన విషయాన్ని గుర్తించాం. జిల్లా కలెక్టర్ ప్రోత్సాహంతో హరితహారంలో మొక్కల ప్లాంటేషన్‌ను పకడ్బందీగా చేపడుతున్నాం. కొన్ని ప్రాంతాలను గుర్తించి మొక్కలు నాటించాం. సంరక్షణ చర్యలు తీసుకుంటున్నాం.
– కె.విజయలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి

హర్షణీయం



పొనికి కలపతో తయారీ చేసిన కొయ్య బొమ్మలు ఎక్కువకాలం మన్నిక ఉంటాయి. వీటి తయారీపై ఆధారపడిన కళాకారుల కుటుంబాలు కర్ర కొరతతో ఇబ్బంది పడ్డాం. రాష్ట్ర ప్రభుత్వం, డీఆర్డీఏ అధికారులు జిల్లాలో పొనికి వనాల పెంపకం చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయం.
– నాంపల్లి రాజశేఖర్‌వర్మ, కళాకారుడు, నిర్మల్

వర్షంలో తడుస్తూ దివ్యాంగుల నిరసన


నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

కైలాస్‌నగర్: జిల్లాకేంద్రంలో వికలాంగులకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన 28వ రోజుకు చేరింది. అయినా అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తూ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద జోరుగా కురుస్తున్న వర్షంలో తడుస్తూ తమ నిరసన తెలిపారు. కలెక్టర్ బయటకు రావాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ గొడుగుసాయంతో వారి వద్దకు వచ్చి సమస్యలను విన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తానని భరోసానివ్వడంతో వారు ఆందోళనను విరమించారు. ఎన్పీఆర్డీ నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.


వర్షంలో గొడుగుపట్టుకుని దివ్యాంగుల సమస్యలను వింటున్న కలెక్టర్

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: అర్జీలను సత్వరం పరిష్కరించాలని డీడీ దిలీప్ కుమార్ అన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా వాణిలో గిరిజనుల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి వెంటనే న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌వో కుమ్ర బాలు, ఐటీడీఏ ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, అధికారులు పాల్గొన్నారు.

- తిర్యాణి మండలం మంగి గ్రామానికి చెందిన కుమ్ర మమత ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ ఇప్పించాలని విన్నవించింది.
- తనకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం బీర్సాయిపేట్ గ్రామానికి చెందిన సీహెచ్ జైతు అర్జీ అందించారు.
- ఎడ్ల జత అందించాలని తలమడుగు మండలం నందిగామ గ్రామానికి చెందిన ఆత్రం మోతీరాం విన్నవించారు.
- తనకు ఆశవర్కర్ ఉద్యోగం ఇప్పించాలని ఉట్నూర్ మండలం ఉమాపతికుంట గ్రామానికి చెందిన మంగం సంగీత అర్జీ సమర్పించింది.


అర్జీలు స్వీకరిస్తున్న డీడీ దిలీప్‌కుమార్

గంగమ్మతల్లికి పూజలు

జైనథ్: మండలంలోని మాండగాడ గ్రామస్తులు సోమవారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డొల్లార సమీపంలో పెన్‌గంగ నది ఒడ్డున పిండివంటలు వండుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని మొక్కుకున్నారు. అనంతరం గంగ నీళ్లను తీసుకువచ్చి, గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. గంగమ్మ వద్ద పూజలు చేస్తుండగానే వరుణుడు కరుణించడంతో గ్రామస్తులు సంతోషించారు. వర్షంలో తడుస్తూ..గంగానీళ్లతో కాలినడకన గ్రామానికి చేరుకున్నారు.


గంగమ్మ నీళ్లతో తిరుగుపయనమైన గ్రామస్తులు

ముగిసిన టీసీఏ జిల్లాజట్టు ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వీఎస్ఆర్ క్రికెట్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన అండర్–19, 25 జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు ముగిశాయి. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొంటారని టీసీఏ జిల్లా ఇన్‌చార్జి నరోత్తంరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక అవుతారన్నారు.


జిల్లా జట్టుకు ఎంపికైన అండర్–19, 25 క్రికెటర్లు

అండర్–19 జిల్లా జట్టు..
మణీశ్వర్, అరవింద్, ఉజ్వల్, రెహాన్‌ఖాన్, దైవిక్ రెడ్డి, శ్రీచరణ్, పవన్, బిలాల్, షాహిద్, వంశీ, అంకిత్, అమన్, ధీరజ్ శివ సూరజ్ ఉబైద్.

అండర్–25 జట్టు..
గంగాప్రసాద్, సాయిప్రసాద్, శుభం, ప్రభా, అనాజ్, రెహన్, సురేష్, రెహాన్‌ఖాన్, సద్దాం, అనికేత్, రోహిత్, జైపాల్, సచిన్, బిలాల్, అమన్.

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో సీఓఈ విద్యార్థికి సీటు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) బెల్లంపల్లి కళాశాల విద్యార్థి ప్రతిష్టాత్మక అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీలో సీటు సాధించాడు. సీఓఈలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న మల్లెపూల సాయితేజ బెంగళూరులోని అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీలో ప్రవేశం కోసం పరీక్ష రాశాడు. రాతపరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహించిన మౌఖిక పరీక్షలో నైపుణ్యత కనబర్చడంతో సీటు వరించింది. సాయితేజ..అండర్ గ్రాడ్యుయేషన్ బీఎస్సీ బీఎడ్ సీటు దక్కించుకుని ప్రతిభ చాటుకున్నట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. సాయితేజతోపాటు సీఓఈలో చదివిన తాటి సాయి, సునార్కర్ అఖిలేశ్వర్ కూడా సీట్లు సాధించినట్లు వివరించారు. కష్టపడే తత్వం, పట్టుదల ఉంటే ఏ యూనివర్సిటీలోనైనా సీటు సాధించవచ్చని సీఓఈ విద్యార్థులు నిరూపిస్తున్నారని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌సీవో స్వరూప రాణి సోమవారం ప్రశంసించారు.


సాయితేజను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు

భైంసాలో 40.6 మి.మీ. వర్షపాతం

భైంసాటౌన్: పట్టణంలో ఆదివారం రాత్రి మోస్తరు వాన కురిసింది. 40.6 మి.మీల వర్షపాతం నమోదైంది. దాదాపు గంటసేపు ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. సోమవారం ఉదయం నుంచి రోజంతా జల్లు కురిసింది. భైంసాలో వారసంత సందర్భంగా కూరగాయలు విక్రయించేందుకు వచ్చిన రైతులు, వ్యాపారులు వర్షానికి ఇబ్బందులు పడ్డారు.

కడెం: మండల కేంద్రంతోపాటు, గ్రామాల్లో సోమవారం మోస్తారు వాన కురిసింది. చెరువులు, కుంటల్లోకి నీళ్లు వస్తుండడంతో వానాకాలం సాగు పనులు చేపట్టిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కురుస్తున్న వర్షం

ఖానాపూర్: మండలంలో రెండు రోజులుగా రాత్రి కురుస్తున్న వర్షం సోమవారం మధ్యాహ్నం ముసురుగా మారింది.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన 40 మంది ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి..సమీప అటవీ ప్రాంతంలో వందమంది కూలీలు సోమవారం ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు. ఆ ప్రాంతంలో పొదలో తేనెటీగలు తెట్టె పెట్టాయి. గమనించకుండా బండరాళ్లను పొదలో వేయడంతో తేనెటీగలు ఒక్కసారిగా కూలీలపై దాడి చేసి కుట్టాయి. గాయపడినవారిని సర్పంచ్ జాడి గంగాధర్ తాళ్లపేట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. వందచోట్ల తేనెటీగలు కుట్టడంతో దేవ లింగన్న పరిస్థితి విషమించడంతో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. మిగతా కూలీలు చికిత్స అనంతరం ఇళ్లకు వెళ్లారు.

దళిత, గిరిజనులను మోసం చేసిన కేసీఆర్

- కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి

కడెం: సీఎం కేసీఆర్ దళిత, గిరిజనులను మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకెట అన్వేశ్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని కొండుకూర్ గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉట్నూర్ జెడ్పీటీసీ, పీసీసీ సభ్యురాలు రాథోడ్ చారులత ఆధ్వర్యంలో సోమవారం దళిత, గిరిజన ఆత్మ గౌరవసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా అన్వేశ్ రెడ్డి హాజరయ్యారు. దళితబంధు పేరుతో లబ్ధిదారుల నుంచి కొందరు ఎమ్మెల్యేలు, నాయకులు మూడు లక్షల వరకు వసూలు చేశారన్నారు. దళితులకు మూడెకరాల భూమి అని కొంతమందికి ఇచ్చి హామీని మరిచారన్నారు. ఇప్పటి వరకు ఖానాపూర్ నియోజవర్గంలో ఒక్క డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయలేదని తెలిపారు. కాంగ్రెస్ హయంలో ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఇందిరమ్మ పథకాన్ని ప్రవేశపెట్టి గూడులేని ఎంతో మంది నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి సాయం అందించారని అన్నారు. గతేడాది కడెం ప్రాజెక్ట్ నుంచి వచ్చిన భారీ వరదలతో ఎంతో మంది రైతుల భూములు, పంటలు నష్టపోయినా ప్రభుత్వం సాయం అందించకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, ధరణి పోర్టల్ రద్దు, కిసాన్ కమిషన్ ఏర్పాటు, వ్యవసాయానికి ఉపాధిహామీ పథకం వర్తింపు, పోడు, అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు, కౌలు రైతులకు రూ.15 వేలు, భూమిలేని ఉపాధిహామీ కూలీలకు ఏడాదికి రూ.12 వేల సాయం, భూమిలేని రైతులకు రైతుబీమా వర్తింపు, రూ.500లకే సిలిండర్, తదితర పథకాలను అమలు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్ చౌహాన్, ఎల్‌డీఎం(లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్) పార్లమెంట్ ఇన్‌చార్జి రఘునాథరెడ్డి, నియోజవర్గ ఇన్‌చార్జి సత్యనారయణ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, మహిళ విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు గీతారెడ్డి, జిల్లా నాయకులు మల్లారెడ్డి, శంతన్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, ప్రభాకర్, బాపురావు, సత్యం, వెంకటేశ్, సలీం, రహీం, శంకర్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అన్వేశ్‌రెడ్డి

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అందించనున్న సివిల్స్ లాంగ్ టర్మ్ ఉచిత శిక్షణకు (ప్రిలిమ్స్ కమ్ మెయి న్స్) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి జూలై 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి జూలై 16న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ తరగతులు జూలై 31 నుంచి 2024 ఏప్రిల్ 30 వరకు ఉస్మానియా యూనివర్సిటీలో కొనసాగుతాయన్నారు. లాడ్జింగ్, బోర్డింగ్, రవాణా కోసం రూ.5వేలు, రూ.5వేల విలువ చేసే స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు తెలిపారు. 31 సంవత్సరాలలోపు ఉండి సివిల్ సర్వీస్ (ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు మాత్రమే అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 08732–221280 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

'విశ్వ గురువుగా భారత్'

జైనథ్: మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశం విశ్వ గురువుగా ఎదిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. సోమవారం మేడిగూడలో మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. 65 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో దేశం అట్టడుగు స్థాయికి చేరిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదిలాబాద్‌కు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కట్టి ఇస్తే దాన్ని నడిపే సత్తా కూడ కేసీఆర్ ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేసారు. నిరుపేదలకు డబుల్ బెడ్‌రూంలు వంటి హామీలు నెరవేర్చని బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కట్కం రాందాస్, నాయకులు రమేశ్, జ్యోతి, జ్యోతిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సంతోష్, ముకుంద్ రావ్, తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు వివరిస్తున్న పాయల్ శంకర్

బహిరంగ సభ విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: హైదరాబాద్‌లోని నిజాం కాలేజ్ మైదానంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించే బహిరంగ సభ ను విజయవంతం చేయాలని జాతీయ ప్రధా న కార్యదర్శి మోతె బారిక్‌రావ్ పిలుపునిచ్చా రు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో సోమవారం బహిరంగసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ఇచ్చినా హామీ మేరకు ప్రత్యేక చొరవతో కేంద్రాన్ని ఒప్పించాలన్నారు. మా దిగల జనాభా ప్రతిపాదికన వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు కేటాయించాలన్నారు. నాయకులు బొజ్జ అడేల్లు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు